గురువారం 15-8-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 425, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

దినపత్రిక



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com




610 కిలోల నుంచి 60 కేజీలకు తగ్గాడు

వివరాలు 2లో



వావివరుసలు లేని సమాజం

వివరాలు 3లో



మనిషి శరీరంలో 63 డ్రగ్స్ క్యాప్సూల్స్

వివరాలు 4లో



ఆగష్టు 15 ఆంగ్లేయులకు నచ్చిన రోజా..?

వివరాలు 4లో

## ఉచిత పథకాలన్నీ నిలిపివేస్తాం

### మహారాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



ముందడుగు జాతీయం:

ఉచిత పథకాల పేరుతో వృథా చేసేందుకు భారీ నగదు ఉంటుంది కానీ, ఆక్రమంగా భూమిని కోల్పోయిన ప్రైవేటు వ్యక్తికి పరిహారం ఇవ్వడానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ మహారాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో మహారాష్ట్ర ప్రభుత్వ వైఖరి తగిన విధంగా లేదని ఆక్షేపించిన న్యాయస్థానం.. బాధితులకు పరిహారం చెల్లించేంత వరకూ ఉచిత పథకాలన్నీ నిలిపివేస్తామని హెచ్చరించింది.

మహారాష్ట్రలో ఆరు దశాబ్దాల క్రితం ఆక్రమణకు గురైన ఓ భూవివాదంపై సుప్రీం కోర్టులోని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. మంగళవారంతోపాటు బుధవారం వాదనలు కొనసాగాయి. ఈ క్రమంలో రూ.317కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని పిటిషన్‌దారు వాదించగా.. రూ.37కోట్లు మాత్రమే చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రభుత్వ ఖజానా నుంచి ఉచితాల కోసం వృథా చేసేందుకు రూ.వేల కోట్ల ఉంటాయి. కానీ, చట్టప్రకారం కాకుండా అక్రమంగా లాక్కున్న భూమికి పరిహారం ఇచ్చేందుకు డబ్బులు ఉండవు" అని వ్యాఖ్యానించింది. ఆగస్టు 28కి విచారణ వాయిదా వేసింది. ఆ తేదీలోగా ప్రభుత్వం సరైన ప్రతిపాదనతో రాకుంటే, తగువిధంగా ఆదేశాలు ఇస్తామని హెచ్చరించింది.



## వినేశ్ అప్పీల్‌ను కొట్టివేసిన కాస్

### ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష వెల్లడి

ముందడుగు జాతీయం:

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ లో నిరాశ ఎదురైంది. పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ చేసిన అప్పీల్‌ను కాస్ కొట్టివేసింది. ఫైనల్‌కు చేరిన తర్వాత అనర్హత వేటు వేయడంతో తనకు రజతం ఇవ్వాలని వినేశ్ అప్పీల్‌లో కోరింది. దీనిపై విచారణ చేపట్టిన కాస్ అడ్‌హక్ డివిజన్ బుధవారం తీర్పును ఇచ్చింది. ఫొగాట్ చేసిన అప్పీల్‌ను కాస్ తిరస్కరించిందని భారత ఒలింపిక్

మిగతా 2లో

## నన్ను తిట్టండి.. నా రాష్ట్రాన్ని దూషించొద్దు

- ఆందోళనలు సృష్టించేందుకు బిజెపి ప్రయత్నం
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

ముందడుగు పశ్చిమబెంగాల్:

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన సంచలనం సృష్టిస్తోంది. సీబీఐ ఈ కేసు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీనిపై స్పందించిన సీఎం మమతా బెనర్జీ.. ఆరోపణలను ఖండించారు. "ఈ కేసులో అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నప్పటికీ.. రాష్ట్ర

మిగతా 2లో






## జూనియర్ వైద్యురాలిపై జరిగింది గ్యాంగ్ రేపా...?

- వైద్యురాలి మృతదేహంలో అధికమొత్తంలో వీర్యం
- బయటపడుతున్న సంచలన విషయాలు
- కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ

ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో జరిగిన జూనియర్ వైద్యురాలి అత్యాచార కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మృతురాలిపై సామూహిక అత్యాచారం జరిగి ఉంటుందనే

మిగతా 2లో

ముందడుగు
గురువారం, 15-8-2024, హైదరాబాద్

# వినేశ్ అప్పీల్‌ను కొట్టివేసిన కాస్

(మొదటిపేజీ తరువాయి)
సంఘం ప్రకటించింది. "యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (విధించిన అనర్హతను సవాలు చేస్తూ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ చేసిన అప్పీల్‌ను కాస్ తిరస్కరించడం దిగ్ర్భాంతికి, నిరాశకు గురిచేసింది. రజత పతకం ఇవ్వాలని వినేశ్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చుతూ కాస్ ఆగస్టు 14న తీర్పును ఇచ్చింది" అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అదనంగా బరువు ఉందని వినేశ్‌పై అనర్హత వేటు వేసింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేయడంతోపాటు 50 కిలోల ఫైనల్లో ఓడిన లోపెజ్ (క్యూబా)తో కలిసి తనకు రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీలు చేసిన విషయం తెలిసిందే.

# యూపీఐ సేవలు ప్రారంభించిన స్విగ్గీ

ముందడుగు బిజినెస్:
ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ కూడా యూపీఐ సదుపాయాన్ని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ బుధవారం వెల్లడించింది. యూపీఐ సదుపాయంతో ఇకపై స్విగ్గీ ప్లాట్‌ఫామ్‌లో ఫుడ్ ఆర్డర్ చేసే కస్టమర్లు.. చెల్లింపుల కోసం గూగుల్ పే, ఫోన్ పే తరహా థర్డ్ పార్టీ యాప్స్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. నేరుగా స్విగ్గీ యాప్ ద్వారానే పేమెంట్ చేయొచ్చు. లావాదేవీల ప్రక్రియను మరింత వేగవంతం చేయడం కోసం ఈ సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు స్విగ్గీ హెడ్ అనురాగ్ రెడ్డిస్ తెలిపారు.




# నన్ను తిట్టండి.. నా రాష్ట్రాన్ని దూషించొద్దు

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వ తీరును కొందరు తప్పు పడుతున్నారు. మాకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారు. ఉద్దేశ పూర్వకంగానే ఇదంతా చేస్తున్నట్లు అర్థమవుతోంది. కావాలంటే నన్ను ఎంతైనా తిట్టండి.. కానీ, రాష్ట్రాన్ని దూషించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కేసులో సీబీఐకి మా పూర్తి సహకారం అందిస్తాం. ఈ కేసును త్వరగా పరిష్కరించాలని కోరుకుంటున్నా" అని దీదీ పేర్కొన్నారు.

**అల్లర్లు సృష్టించాలనే వారి ప్రయత్నం..**
బెంగాల్‌లో బంగ్లాదేశ్ తరహా ఆందోళనలు సృష్టించేందుకు బిజెపి, సీపీఎం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని మమతా బెనర్జీ ఆరోపించారు. నిరసనలు చేస్తున్న వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనలో కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆమెపై సామూహిక హత్యాచారం జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# జూనియర్ వైద్యురాలిపై జరిగింది గ్యాంగ్ రేపా...?

(మొదటిపేజీ తరువాయి)
అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె మృతదేహంలో అధిక మొత్తంలో వీర్యాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆసుపత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఆమె మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్లు పోస్ట్‌మార్టంలో గుర్తించారట. తమ కుమార్తె మృతిపై ఆమె తల్లిదండ్రులు కోర్టులో వేసిన పిటిషన్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీన్ని బట్టి చూస్తే తమ కుమార్తెపై ఒకరి కంటే ఎక్కువ మంది అత్యాచారానికి పాల్పడి ఉంటారని బాధితురాలి తల్లిదండ్రులు పిటిషన్‌లో ఆరోపించారు. వైద్య నిపుణులు కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. "ఆమె శరీరానికి అయిన గాయాలను చూస్తుంటే ఒక వ్యక్తి మాత్రమే దాడి చేసినట్లు కన్పించట్లేదు. మృతురాలి వ్యక్తిగత అవయవాల్లో 150 మిల్లీగ్రాములు వీర్యం ఉన్నట్లు పోస్ట్‌మార్టం నివేదికలో ఉంది. ఆ మోతాదు కేవలం ఒకే వ్యక్తికి సాధ్యం కాదు. ఇందులో ఎక్కువ మంది దారుణానికి పాల్పడి ఉండొచ్చు" అని అఖిల భారత ప్రభుత్వ వైద్యుల సమాఖ్య అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబర్ణ గోస్వామి అభిప్రాయపడ్డారు. దీంతో ఆమెపై సామూహిక అత్యాచారం జరిగే ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సీబీఐ కూడా దృష్టి సారించినట్లు సమాచారం.

# 610 కిలోల నుంచి 60 కేజీలకు తగ్గాడు

## 30 మంది వైద్యుల పర్యవేక్షణలో డైట్ చార్ట్

### మాజీ సౌదీ రాజు అందించిన సహకారం



ముందడుగు డెస్క్:
మనిషికి ఊబకాయం ఉంటే ఏ పని చేయడానికి ఆసక్తి ఉండదు.. ఊబకాయం మనిషిని మరింత సోమరిపోతుగా మార్చివేస్తోంది. అలాంటిది ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక బరువున్న వ్యక్తిగా వార్తల్లో నిలిచిన వ్యక్తి ఏకంగా 542 కేజీల బరువు తగ్గిపోయాడు. 610 కిలోల నుంచి 60కేజీలకు తగ్గాడు. ఓ రాజు అందించిన సహకారం ఆ వ్యక్తి పాలిట వరమైంది. మీడియా కథనాల ప్రకారం..

సౌదీ అరేబియాకు చెందిన ఖలీద్ బిన్ మొహసేన్ షారీ.. భారీ దేహంతో నానా అవస్థలు పడేవాడు. 2013లో 610 కేజీల బరువు పెరిగాడు. దాంతో మూడేళ్లపాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. తన పనులు కూడా చేసుకోలేని పరిస్థితికి దిగజారిపోయాడు. ఖలీద్ స్టోరీ విన్న మునుపటి సౌదీ రాజు అబ్దుల్లా.. అతడి ప్రాణాలు కాపాడాలని నిర్ణయించుకున్నాడు. తన సొంత డబ్బుతో ఖలీద్‌కు వైద్య సేవలు అందించడం ప్రారంభించారు. ప్రత్యేకంగా ఒక బెడ్ డిజైన్ చేయించారు. అలాగే అతడిని రియాద్‌లోని కింగ్ ఫాహద్ మెడికల్ సిటీకి తరలించారు. 30 మంది వైద్యులు ఎప్పటికప్పుడు అతడికి చికిత్స అందిస్తూ..ఒక డైట్ చార్ట్‌ను సిద్ధం చేశారు.

గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ చేశారు. శరీరంలో కదలికలను పునరుద్ధరించేందుకు వ్యాయామాలు చేయించేవారు. ఫిజియోథెరపీ నిర్వహించేవారు. దాంతో ఆరు నెలల్లో సగానికి సగం బరువు తగ్గాడు. ఇక 2023లో 542 కేజీలు తగ్గి అందరినీ ఆశ్చర్యపర్చాడు. దాంతో 600 కేజీలున్న వ్యక్తి కాస్తా 60 కేజీల ఆరోగ్యవంతుడిగా మారిపోయాడు. అదనపు చర్మం తొలగింపు కోసం శస్త్ర చికిత్సలు అవసరమయ్యాయి. సరికొత్త రూపు సంతరించుకున్న ఆయన్ని ఇప్పుడు అంతా స్మైలింగ్ మ్యాన్ అంటూ పిలుస్తున్నారు.



**రోడ్లపై గుంతలు ఏర్పడితే**

# కాంట్రాక్టర్లే కారణం.. ఇంజనీర్లదే బాధ్యత

## గోవా సిఎం వెల్లడి

ముందడుగు గోవా:
రోడ్లు వేసిన కొన్ని రోజులుగా నాశనమై పోతున్నాయి. నాసిరకం రోడ్లపై గోవా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. 100 మందికిపైగా కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రోడ్లపై గుంతల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు ప్రభుత్వ ఇంజనీర్లే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. సీఎం ప్రమోద్ సావంత్ బుధవారం ప్రజా పనుల విభాగం సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వినాయక చవితి పండగ నాటికి రోడ్లపై గుంతలు కనబడకుండా చేయాలని ఆదేశించారు. రోడ్లపై గుంతల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని పీడబ్ల్యూడీ సీనియర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇంజనీర్లతో పాటు 100 మందికి పైగా రోడ్డు కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సీఎం తెలిపారు. కాంట్రాక్టర్లు ప్రాధాన్యతల ప్రాతిపదికన గుంతలను పూడ్చాలన్నారు. ఈ పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక భారాన్ని తీసుకోదని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లందరికీ అదనపు డబ్బు చెల్లించకుండా అక్టోబర్ తర్వాత రోడ్లను తిరిగి వేయాలని కోరనున్నట్లు తెలిపారు. వ్యవస్థ జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశం తోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అనేక కఠినమైన చర్యలు తీసుకుంటోందన్నారు.

ముందడుగు
గురువారం, 15-8-2024, హైదరాబాద్

# మనిషి శరీరంలో 63 డ్రగ్స్ క్యాప్స్యూల్స్

## టాంజానియా వ్యక్తి అరెస్ట్ చేసిన కస్టమ్స్ ▪ ఆసుపత్రికి తరలించి డ్రగ్స్ వెలికితీత



ముందడుగు జాతీయం:

ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టాంజానియాకు చెందిన వ్యక్తిని కస్టమ్స్ అధికారులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ తీసుకెళ్తున్నాడనే అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని అధికారులు విచారించగా.. కొకైన్ క్యాప్స్యూల్స్ మింగినట్లు బయటపడింది. దీంతో.. అతనికి వెంటనే వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడు. క్యాప్స్యూల్స్‌లో నింపిన మందు విలువను లెక్కించగా.. కోట్ల రూపాయల్లో ఉంది. దీంతో అధికారులు ఆశ్చర్యపోయారు. ఆగస్టు 1న టాంజానియాకు చెందిన వ్యక్తి దార్ ఎస్ సలామ్ టాంజానియా నుండి అడిస్ అబాబా, దోహా మీదుగా ఢిల్లీకి చేరుకున్నాడు. కాగా.. ఎయిర్ పోర్టులో అనుమానంతో పట్టుకున్నామని అధికారులు తెలిపారు.

విచారణలో భాగంగా.. డ్రగ్స్‌తో కూడిన 63 క్యాప్స్యూల్స్‌ను మింగినట్లు ఆ వ్యక్తి అధికారుల ముందు అంగీకరించినట్లు కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. అతన్ని వైద్య చికిత్స కోసం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతని శరీరం నుండి 63 క్యాప్స్యూల్స్‌ను బయటకు తీశారు. ఈ క్యాప్స్యూల్స్‌ను శరీరం నుంచి తీసినప్పుడు అందులో 998 గ్రాముల తెల్లటి పౌడర్ కనిపించింది. సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వ్యక్తులు ఈ పౌడర్ ను మత్తుమందుగా గుర్తించారు. ఈ క్రమంలో.. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. క్యాప్స్యూల్‌లో తెల్లటి పౌడర్ వెలువడేది కొకైన్ అని విచారణలో తేలింది. 998 గ్రాముల కొకైన్ విలువ రూ.14.97 కోట్లు అని కస్టమ్స్ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం.. ప్రయాణికుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుండి మత్తుపదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.



# వావివరుసలు లేని సమాజం

## ▪ కన్నకూతురిపై తండ్రి అత్యాచారం
## ▪ రాయ్‌బరేలీలో దారుణ సంఘటన

ముందడుగు ఉత్తరప్రదేశ్:


ఎన్ని చట్టాలు వచ్చినా, ఎంతమందికి శిక్షలు పడినా ఆడవారిపై అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కామాంధులు వావివరుసలు కూడా చూడటం లేదు. కన్న కూతుర్లపై కూడా అత్యాచారానికి ఒడిగడుతున్నారు. తాజాగా.. యూపీలోని రాయ్‌బరేలీలో అలాంటి ఘటన వెలుగు చూసింది. ఇంట్లో నిద్రిస్తున్న ఏడేళ్ల బాలికపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు గ్రామస్తులకు చెప్పడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. అనంతరం.. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పారు. దీంతో.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు తండ్రిని అదుపులోకి తీసుకున్నారు. కాగా.. ఈ ఘటన ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

ఈ కేసు బచ్రావాన్ ప్రాంతంలో చోటు చేసుకుంది. కన్న తండ్రి తన ఏడేళ్ల కూతురిని తన కామ కోరికలకు బలి చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. బాలిక ఇంట్లో నిద్రపోతుండగా ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే.. నాలుగు రోజుల క్రితం తల్లి చుట్టాలింటికి వెళ్లింది. ఇంట్లో మరెవరూ లేరు.

ఈ క్రమంలో.. కూతురిని ఒంటరిగా ఉందని తండ్రి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఉదయం బాధితురాలు గ్రామస్తులకు చెప్పింది. బాలిక మాటలు విని ఆగ్రహించిన గ్రామస్తులు తండ్రిని కొట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్ హెడ్ ఓంప్రకాష్ తివారీ మాట్లాడుతూ.. నిందితుడు తండ్రిపై కేసు నమోదు చేశామని.. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఒలింపిక్స్ గోల్డ్ విజేతకు గేదె బహుమతి

## గ్రామాల్లో గౌరవానికి చిహ్నంగా అందజేత



ముందడుగు పాకిస్తాన్:

పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ పారిస్ ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించారు. 92.97 మీటర్లతో ఒలింపిక్ రికార్డును బద్దలుకొట్టి, ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయ్యారు. నదీమ్‌కు చాలా బహుమతులు అందుతున్నాయి. తాజాగా నదీమ్‌కు తన మామ మహ్మద్ నవాజ్ ఒక స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. స్థానిక సంప్రదాయం ప్రకారం.. తమ గ్రామంలో గౌరవానికి చిహ్నంగా భావించే గేదెను బహుమతిగా ఇచ్చాడు. ఇలాంటి బహుమతికి తమ సంప్రదాయాల్లో చాలా ప్రాముఖ్యత ఉందని నవాజ్ తెలిపారు. గ్రామీణ పంజాబ్‌లోని ఓ పేద కుటుంబంలో అర్షద్ నదీమ్ జన్మించాడు. మట్టి, ఇటుకతో నిర్మించిన ఇంట్లో పెరిగాడు. సరైన వసతులు, ఆహారం లేని రోజుల నుంచి ఒలింపిక్ పతక విజేత వరకు అర్షద్ నదీమ్ ప్రయాణం అద్భుతం. ఈ ప్రయాణం స్ఫూర్తినే కాదు పాకిస్థాన్‌లో ఉన్న క్రీడా సౌకర్యాలపై కూడా స్పష్టతను ఇస్తుంది. పరిమిత వనరుల కారణంగా గోధుమ పొలాల్లో ఇంట్లో తయారు చేసిన జావెలిన్‌లతో నదీమ్ శిక్షణ పొందాడు. క్రికెట్‌కి తప్ప మరో క్రీడకు పాకిస్థాన్‌లో ఆదరణ లేదని నదీమ్ చేసిన వ్యాఖ్యలు ఆ దేశ పరిస్థితికి అద్దం పడుతాయి. జావెలిన్ త్రోలో అతడు సాధించిన విజయంతో పాక్‌లో ఇతర క్రీడలకు మద్దతు పెరుగుతుందని అందరూ ఆశిస్తున్నారు.

# సాక్షులను బెదిరించిన కేసులో ఒకరు అరెస్ట్

ముందడుగు వెంకటాపూర్:

వెంకటాపూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మొగుళ్ళ భద్రయ్య పై గతంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఉన్న సాక్షులను బెదిరించిన కేసులో అదే గ్రామానికి బొచ్చు సమ్మయ్య ను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్టు వెంకటాపూర్ ఎస్ ఐ జక్కుల సతీష్ తెలిపారు.ఈ మేరకు ఆయన బుధవారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల తో మాట్లాడుతూ చట్టపరమైన కేసుల్లో భాగస్వామ్యం అయినా సాక్షులను బెదిరించిన,ప్రలోబాలకు గురిచేసిన చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. వెంకటాపూర్ మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని,అలా మరల జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.శాంతి భద్రతల పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరిగిన కఠిన చర్యలు తీసుకోకతప్పదని ఎస్ ఐ సతీష్ హెచ్చరించారు.

# అద్దె సాయంగా రూ. 6 వేలు

## వయనాడు బాధితులకు కేరళ సీఎం వెల్లడి




ముందడుగు కేరళ:

కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా బాధితులకు అద్దె సాయంగా రూ.6 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నాం. అదేవిధంగా బాధితులకు అద్దె సాయం కింద రూ.6 వేలు ఇవ్వనున్నాం. 60 శాతం గాయపడిన వారికి రూ.75,000, 40 నుంచి 50 శాతం గాయపడిన వారికి రూ.50 వేలు అందజేస్తాం. తీవ్రంగా గాయపడిన వారికి అదనంగా రూ.50 వేలు సాయంగా అందజేస్తాం. ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధి నుంచి ఈ నిధులు కేటాయిస్తాం' అని సీఎం పినరయి విజయన్ వెల్లడించారు.

# కేజ్రీవాల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు

- మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని వెల్లడి
- సిబిఐకి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం



ముందడుగు ఢిల్లీ:
ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది. తన అరెస్ట్‌కు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. కేజ్రీకి మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది. ఈ మేరకు కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ కేసులో బెయిల్ కోరుతూ కేజ్రీవాల్ ఇటీవలే సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని దేశ అత్యున్నత న్యాయ స్థానంలో సవాల్ చేశారు. ఈ కేసులో కేజ్రీ రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ వేసినట్లు ఆప్ న్యాయ బృందం సోమవారం తెలిపింది. దీంతో పాటు గతంలో ఈ కేసులో ట్రయల్ కోర్టు తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ పై హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ మరో రెండు పిటిషన్లు దాఖలు చేశారు.

ఈ పిటిషన్లపై సుప్రీం కోర్టు బుధవారం విచారణ జరిపింది. ఇరువురి తరఫున వాదనలు విన్న ధర్మాసనం సీఎం కేజ్రీవాల్‌కు ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేజ్రీ పిటిషన్‌పై సమాధానాన్ని కోరుతూ సీబీఐకి నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

# ఆగష్టు 15 ఆంగ్లేయులకు నచ్చిన రోజా..?

- అందుకే మనకు అప్పుడు స్వాతంత్ర్యం ఇచ్చారా
- అప్పటి బ్రిటిష్ అధికారి పన్నాగమేనా

ముందడుగు ప్రత్యేకం:
ఆగస్టు 15వ తేదీన భారతీయులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని గర్వంగా జరుపుకుంటారు. కానీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆగస్టు 15వ తేదీనే ఎందుకు జరుపుకుంటున్నారని అడిగితే.. భారతీయులు తెల్ల దొరలను దేశం నుంచి తరిమి కొట్టిన తేదీ కాబట్టి అని సమాధానం చెబుతారు. కానీ ఇది కరెక్ట్ కాదు. నిజానికి భారతదేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు ప్రకటించాలనేది బ్రిటీష్ వారు ముందుగానే నిర్ణయించారు. అయితే ఆగస్టు 15ను ఇందుకు ఎంపిక చేయడం వెనుక ఒక ఆసక్తికరమైన విషయం ఉంది.

## రెండో ప్రపంచ యుద్ధం ప్రభావం

మనదేశంపై ఆధిపత్యం సాధించిన బ్రిటీష్ వారు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత చాలా బలహీనపడిపోయారు. వారి సంపద తగ్గిపోయింది. సైన్యం కూడా బలహీనంగా మారింది. అప్పటి పరిస్థితుల కారణంగా అతిపెద్ద సామ్రాజ్యాన్ని కొనసాగించడం కష్టమైంది. అందుకే, వారు తమ ఆధీనంలో ఉన్న దేశాలకు స్వతంత్రం ప్రకటించాలని నిర్ణయించారు. అప్పటి ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ నేతృత్వంలోని బ్రిటీష్ ప్రభుత్వం, పెరుగుతున్న మనదేశ బలాన్ని గుర్తించి, భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని



నిర్ణయించింది. అయితే ఇండియాకు ఏ రోజున స్వాతంత్ర్యం ప్రకటించాలనేది వారు పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఒక్క లార్డ్ మౌంట్ బాటన్ మాత్రం ఆ తేదీ తనకు ఇష్టమైన తేదీ కావాలనుకున్నాడు. బాటన్ భారతదేశానికి చివరి బ్రిటీష్ వైస్రాయ్. భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చే బాధ్యతను బ్రిటన్ ప్రధాని క్లెమెంట్ అట్లీ, లార్డ్ మౌంట్ బాటన్‌కు అప్పజెప్పారు. ఆయన ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించాలని నిర్ణయించారు. ఆగస్టు 15ను ఎందుకు ఎంచుకున్నారని లార్డ్ మౌంట్ బాటన్‌ని అడిగినప్పుడు, "నేను ఈ తేదీని పెద్దగా ఆలోచించకుండానే సెలక్ట్ చేశాను. ఓ ప్రశ్నకు రియాక్ట్ అవుతూ ఈ డేట్ చెప్పాను. ఎందుకంటే ఈ మొత్తం ప్రాసెస్‌పై నాకే కంట్రోల్ ఉన్నట్లు చూపించాలనుకుంటున్నాను. స్వాతంత్ర్యం ఇవ్వడానికి సెట్ చేసే తేదీ దగ్గరలోనే ఉండాలని నాకు తెలుసు. నేను దీన్ని కచ్చితంగా ప్లాన్ చేయలేదు, కానీ అది ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో ఉండాలని అనుకున్నాను. తర్వాత ఆగస్టు 15ను సెలక్ట్ చేశాను. ఎందుకంటే ఇది జపాన్ లొంగిపోయిన రెండవ వార్షికోత్సవం." అని చెప్పుకొచ్చారు.

## జపాన్‌తో సంబంధం ఏంటి?

ఫ్యాట్ మ్యాన్, లిటిల్ బాయ్ అనే అణుబాంబుల దాడుల తర్వాత 1945, ఆగస్టు 15న జపాన్ లొంగిపోయింది. ఈ సరెండర్‌ను స్వీకరించిన వ్యక్తి మౌంట్ బాటన్. ఆ సమయంలో ఆయన దక్షిణాసియా కమాండ్‌కు సుప్రీం కమాండర్‌గా ఉన్నారు. అంటే, భారతదేశానికి చాలా ప్రాముఖ్యమైన స్వాతంత్ర్య దినోత్సవ తేదీని, తన సొంత విజయానికి సంబంధించిన ఓ సంఘటనను గుర్తు చేసుకునేలా ఎంచుకున్నాడు. అతని ఆలోచన తీరు చాలామందిని ఆశ్చర్యపరిచింది.

# భార్య ఎంపీ.. భర్త కానిస్టేబుల్

## సెక్యూరిటీ ఆఫీసర్‌గా భర్త నియామకం


ముందడుగు రాజస్థాన్:
రాజస్థాన్ లోని భరత్ పూర్ లోక సభ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన సంజన జాటవ్ కు ఆమె భర్తను సెక్యూరిటీ ఆఫీసర్ గా జిల్లా ఎస్పీ నియమించారు. సంజనా జాటవ్ భర్త పేరు కప్తాన్ సింగ్. ఆయన భరత్ పూర్ లోని గాజీ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా డ్యూటీ చేస్తున్నారు. తన భర్తే తనకు సెక్యూరిటీ ఆఫీసర్ గా రావడం పై ఎంపీ సంజనా జాటవ్ స్పందిస్తూ.. "నా భర్తే నా బలం. ఆయన నాతో ముందునుంచి ఉంటారు. నాకు ఆయనే ధైర్యం. ఇప్పుడు ఆయన డ్యూటీ చేస్తూ రోజంతా నాతోనే ఉంటారు. నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఎంపీ అయినా ముందు ఆయనకు భార్యనే. ఎంపీగా గెలిచిన తరువాత కూడా మా బంధంలో ఏ మార్పు రాలేదు. నాకు ఇద్దరు పిల్లలు. ఇంట్లో వారి పనుల్నీ ఇప్పటికీ నేనే చూస్తుంటాను. ఎంపీగా విజయం సాధించిన తరువాత నా బాధ్యతలు ఇంకా పెరిగిపోయాయి. ఇప్పుడు భరత్ పూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం నా ప్రధాన కర్తవ్యం. నా బాధ్యతల్లో నా భర్త ఎప్పుడూ సహకారం ఎప్పుడూ ఉంటుంది," అని అన్నారు.

మరోవైపు ఆమె భర్త కానిస్టేబుల్ కప్తాన్ సింగ్ మాట్లాడుతూ.. "నేను నా భార్యకు సెక్యూరిటీ ఆఫీసర్ గా ఉంటే. ఆమె నిశ్చింతగా తన ఎంపీ బాధ్యతలపై దృష్టి పెట్టవచ్చు. ఆమె సంరక్షణ బాధ్యతలు నాకు లభించడం చాలా ఆనందంగా ఉంది." అని చెప్పారు.





ముందడుగు
గురువారం,
15-8-2024,
హైదరాబాద్



కమల్ హాసన్‌ను రీప్లేస్ చేసెదెవరు..?

# బిగ్ బాస్ తమిళ్ హోస్ట్‌గా మరో స్టార్ హీరో పేరు..!

పాపులర్ టెలివిజన్ రియాలిటీ షో బిగ్ బాస్ తమిళ్ కొన్ని రోజులుగా తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. బిగ్ బాస్ తమిళ్ అప్‌కమింగ్ సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించడం లేదని ఉలగనాయగన్ కమల్ హాసన్ అధికారికంగా ప్రకటించడంతో నెక్ట్స్ ఎవరు ఈ బాధ్యతలు తీసుకోబోతున్నారంటూ ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇక బిగ్ బాస్ తమిళ్ కొత్త సీజన్‌కు హోస్ట్ ఎవరైతే బాగుంటుందని సర్వే చేస్తే చాలా మంది శింబు పేరు చెప్పారు. దీంతో ఇక శింబు హోస్ట్‌గా చేసే అవకాశాలున్నాయంటూ వార్తలు ఊపందుకున్నాయి.

ఇదిలా ఉంటే తాజాగా మరో స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి పేరు నెట్టింట చక్కర్లు కొడుతోంది. కామింగ్ టైమింగ్, ఎంగేజింగ్ స్క్రీన్ ప్రజెంటేషన్‌తో ఆకట్టుకోవడం విజయ్ సేతుపతి స్టైల్. వచ్చే సీజన్‌కు మక్కళ్ సెల్వన్ హోస్ట్‌గా రాబోతున్నారంటూ పుకార్లు షికారు చేస్తున్నాయి. ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి అధికారిక అప్‌డేట్ లేనప్పటికీ.. ఒకవేళ ఇదే నిజమైత బిగ్ బాస్ తమిళ్ కొత్త సీజన్‌కు విజయ్ సేతుపతి ఎంట్రీ తప్పకుండా డబుల్ క్రేజ్ తెచ్చిపెడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు సినీ జనాలు.

ఇటీవలే మహారాజతో సూపర్ హిట్టు కొట్టిన మక్కళ్ సెల్వన్ ప్రస్తుతం Gandhi Talks, విడుదల పార్ట్ 2ల్లో నటిస్తున్నాడు. మరి బిగ్ బాస్ షోపై ఏదైనా క్లారిటీ ఇస్తాడేమో చూడాలి. కమల్ హాసన్ ముందుగా ఉన్న సినిమా కమిట్‌మెంట్స్ కారణంగా బిగ్ బాస్ తమిళ్ అప్‌కమింగ్ సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించలేకపోతున్నట్టు ప్రకటించాడని తెలిసిందే. మరి ఆయన స్థానాన్ని ఎవరు రీప్లేస్ చేస్తారని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



ప్రభాస్ అభిమానులకు రవితేజ

# మిస్టర్ బచ్చన్ టీం స్పెషల్ ట్రీట్..!

టాలీవుడ్ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలు మిస్టర్ బచ్చన్, రాజాసాబ్. ఈ రెండు సినిమాలను లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కిస్తోంది. వీటిలో హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన మిస్టర్ బచ్చన్ మరికొన్ని గంటల్లో (ఆగస్టు 15న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. కాగా ప్రభాస్ అభిమానుల కోసం మిస్టర్ బచ్చన్ టీం అదిరిపోయే ట్రీట్ ఇవ్వనుందన్న వార్త ఒకటి నెట్టింట హల్చల్ చేస్తోంది.


ఇంతకీ అదేంటనే కదా మీ డౌటు.

థియేటర్లలో ఒకేసారి రవితేజ, ప్రభాస్‌ను చూస్తే ఎలా ఉంటుంది. మిస్టర్ బచ్చన్ స్క్రీనింగ్ టైంలో అదే జరుగబోతుందట. రాజాసాబ్ గ్లింప్స్‌ను మిస్టర్ బచ్చన్ స్క్రీనింగ్ టైంలో డిస్ ప్లే చేసి అభిమానులను ఖుషీ చేసేలా రవితేజ టీం ప్లాన్ చేసుకుందన్న వార్త ఒకటి ఫిలిం నగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇదే నిజమైతే ప్రభాస్ అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాజాసాబ్‌ను ట్రెండింగ్ టాపిక్‌గా మార్చడంలో భాగంగా మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను ఖుషీ చేస్తుందననడంలో ఎలాంటి సందేహం లేదు. మిస్టర్ బచ్చన్‌లో భాగ్యశ్రీ బోర్సే ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. మారుతి అండ్ టీం విడుదల చేసిన రాజాసాబ్ గ్లింప్స్ వీడియోలో.. ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతున్న విజువల్స్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# విజయ్ సార్ నన్ను తిట్టాడు..

## ది గోట్ డైరెక్టర్ వెంకట్ ప్రభు కామెంట్స్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటిస్తోన్న తాజా చిత్రం ది గోట్. దళపతి 68గా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నాడు. మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. The GOAT నుంచి మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. విజయ్ ఓ వైపు ఓల్డ్ మ్యాన్‌గా, మరోవైపు యంగ్ లుక్‌లో కనిపిస్తూ సందడి చేస్తున్నాడు.



ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇదిలా ఉంటే ఓ చిట్ చాట్‌లో వెంకట్ ప్రభు చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. విజయ్ సార్‌ను మొదట క్లీన్ సేవ్ లుక్‌లో చూపించినప్పుడు ఆయన నన్ను తిట్టాడు. కానీ ఇప్పుడు ఆ లుక్‌ను విజయ్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సెట్‌లో విజయ్ను చూసి యంగ్ బాయ్‌లా కనిపిస్తున్నారని ప్రశంసించారు. సినిమాలో ఆయన్ను చూసి షాకవుతారంటూ చెప్పకొచ్చాడు వెంకట్ ప్రభు. ది గోట్ అవుట్‌పుట్ పట్ల విజయ్ చాలా సంతోషంగా ఉన్నారు. సినిమా విడుదలకు ముందు ఓ ప్రాజెక్ట్ గురించి విజయ్ ఇంతలా మాట్లాడటం తానిప్పటివరకు వినలేదని.. ఆయన సన్నిహితుడు చెప్పారన్నాడు వెంకట్ ప్రభు. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీలో ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.